పకడ్బందీగా 'జన సురక్ష' అమలు

● నేటి నుంచి కేంద్ర బీమా పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
● అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి


గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమ ప్రచార కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: గ్రామ స్థాయిలో జన సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జన సురక్ష, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన సురక్ష కార్యక్రమం సెప్టెంబరు 30వ తేది వరకు అంటే మూడు నెలల పాటు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలపై పెద్ద ఎత్తున గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద వయోపరిమితి 18 నుంచి 70 సంవత్సరాల లోపు వారు వార్షిక ప్రీమియం రూ.20 చెల్లించాలన్నారు. ఇందుకు ప్రమాద బీమాగా రెండు లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద 18 నుండి 50 సంవత్సరాల లోపు వారు వార్షిక ప్రీమియం రూ.436 చెల్లిస్తే వారికి కూడా రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజనలో భాగంగా నెల నెల కొంత సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేసుకుంటే 60 సంవత్సరాల తర్వాత పెన్షన్ వస్తుందన్నారు. 2014లో బ్యాంకులలో తెరిచిన జనధన్ ఖాతాలకు సంబంధించి 2026 జూన్ 30 తేదిలోగా రీ-కేవైసీ చేయించుకునేలా ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. అందుకు ఆధార్ కార్డు, ప్రస్తుత ఫొటో అందజేయాలన్నారు. అదే విధంగా డిజిటల్ లావాదేవీల పైన కూడా ఖాతాదారులకు సరైన అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి

నంద్యాల: ప్రతి ఒక్కరు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన స్వతంత్ర భారత చరిత్రలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ హత్య దినం కార్యక్రమం నిర్వహించారు. 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించిన సమయంలో బాధిత కుటుంబ సభ్యుడు నంద్యాలకు చెందిన సత్యనారాయణ మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో ప్రజల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ రామునాయక్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల దీక్షకు మద్దతు తెలుతుపున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఇంజినీరింగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే వైఎస్సార్‌సీపీ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొంటుందని ఆ పార్టీ కౌన్సిలర్, శిల్పాసహకార బ్యాంక్ చైర్ పర్సన్ శిల్పానాగినిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపడుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల దీక్షలకు వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్లు, శిల్పానాగిరెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 13వేల మంది ఇంజినీరింగ్ కార్మికులు ఉన్నారని, వారిని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు రామాంజనేయులు, రంగనాథ్, బాలదుర్గన్న మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. జీవో నెం.36 ప్రకారం కార్మికులకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, పున్నారాజేశ్వరి, లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మి, షేక్ షహనాజ్, అనురాధ, శిరీష, నారాయణమ్మ, సమ్మద్, షాదిక్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు శోభారాణి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవనగర్‌బాషా, రహంతుల్లా, రామచంద్రుడు, పార్థుడు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు భాస్కరాచారి, కృష్ణయ్య, రామకృష్ణ, ఆదాము, మురళీ, రాజశేఖర్, సతీష్, సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో అవినీతిపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న రామలక్ష్మయ్య

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు రామలక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్టం మేరకు ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం జిల్లా ఎంపీపీలతో కలిసి పంచాయతీరాజ్ అధికారులకు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపజేయాలన్నారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ.1,151 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీల గౌరవ వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. జీవో నం.11ను రద్దు పరిచి 1350 మంది పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, నంద్యాల ఎంపీపీ ప్రభాకర్, కందికాయపల్లె సర్పంచ్ రామచంద్రుడు, సత్యాలు, శ్రీనివాస రెడ్డి, సువార్తమ్మ, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, సంజీవరాయుడు, శివ, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా


కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు హాజరు కాకుండా డుమ్మా కొట్టారు. జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ రాజకుమారి గణియా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే వాటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తూ ఉంది. అయితే, ఉయ్యాలవాడ మండలంలో కొందరు అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరుకావడం లేదు. మారుమూల గ్రామాల నుంచి అర్జీలు తీసుకొని వచ్చిన బాధితులు కార్యాలయంలో అధికారులు లేక ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం జరిగిన పీజీఆర్‌కు తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ రఘురామిరెడ్డి, ఇందిరకాంతి ఏపీఎం దాసన్న హాజరయ్యారు. వ్యవసాయం, వైద్యం, పశు వైద్యం, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ సంబంధిత శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఈ విషయమై తహశీల్దార్‌ను వివరణ కోరగా మండల స్థాయి అధికారులందరికీ ప్రజా వేదికకు హాజరయ్యేలా సర్క్యులర్ జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఆ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నాయని, జిల్లా విద్యాశాఖ అధికారులు విచారించి వాటి గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పద్మావతి సర్కిల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ యూనియన్ నాయకులు రఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు షాహిద్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థల్లో వివిధ రకాల పేర్లతో ఫీజుల దోపిడీ జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి పాఠశాల 25 శాతం మందికి ఉచిత విద్య అందించాలని, అయితే, పలు పాఠశాలలు దీనిని అమలు చేయడం లేదన్నారు. ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా, హాజరైన సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో పారిశుద్ధ్య పనులపై మునిసిపల్ అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా చెప్పారు. సోమవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధిని పథంలో నడిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. పద్మావతి నగర్ ప్రాంతంలో పూడిక తీతకు మంజూరు అయిన రూ.10 లక్షల నిధుల అంశంపై కౌన్సిల్‌లో చర్చించడాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. మానవతా దృక్పథంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని కౌన్సిల్ దేశం సులోచన కోరారు. మున్సిపల్ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా మున్సిపల్ అధికారులు, కొత్త కమిషనర్ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్‌కాక్ సిలాట్ పోటీలు ప్రారంభం


పతకాలతో విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): 13వ రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్ పోటీలు సోమవారం ఇండోర్ స్టేడియంలో జరిగాయి. నంద్యాల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పెన్‌కాక్ సిలాట్ పోటీల అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సౌత్‌జోన్ సెక్రటరీ మనోజ్‌సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలకు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొని తుంగల్, టాండింగ్, రేగు, గండా, సోలో లాంటి అంశాల్లో బంగారు, వెండి, రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. సిలాట్ నేర్చుకోవడం ఆరోగ్యానికి, దేహ దారుఢ్యానికి మంచిదని తెలిపారు. స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సిలాట్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు

నంద్యాల(వ్యవసాయం): నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని నంద్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున గుప్తా హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని వివిధ కూడళ్లలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 15 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడగా వారి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.75 వేలు జరిమాన విధించారు.

కొనసాగుతున్న శ్రీగురు వైభవం ప్రవచన సప్తాహం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీ గురువైభవం ప్రవచనం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు మాట్లాడుతూ గురువైభవంలో నరసింహ సరస్వతి ఆవిర్భావం, ఔదంబర వృక్ష విశేషం, గురువును సేవించే విధానం, సద్గురు కటాక్షం, మందమతి అయిన బ్రాహ్మణునికి విద్యావితరణ మొదలైన విశేషాల గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి వాసు, మహేష్, రామశేషు, తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు నంద్యాల క్రీడాకారిణి ఎంపిక


రజత పతకంతో క్రీడాకారిణి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 5, 6, 7 తేదీల్లో ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు నంద్యాల క్రీడాకారిణి పబ్బంతి తన్మయి శ్రేయ ఎంపికైనట్లు కోచ్ మహేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తన్మయి శ్రేయ రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో ఆ బాలికను పలువురు అభినందించారు.

రాయితీపై దాణా పంపిణీ

ఉయ్యాలవాడ: పశు పెంపకందారులకు ప్రభుత్వం సరఫరా చేసిన సంపూర్ణ మిశ్రమ దాణా పశు వైద్యాధికారి రఘుబాలపుల్లయ్య సోమవారం అందజేశారు. మండలంలోని హరివరం, ఉయ్యాలవాడ పశు వైద్యశాలల పరిధిలోని పశువులకు పశు పోషణ దాణా 7.5 మెట్రిక్ టన్నులు సరఫరా అయిందన్నారు. 50 శాతం సబ్సిడీతో 50 కేజీల బస్తా దాణా రూ. 555కు పాడి రైతులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. దాణా పశువులకు వాడడం ద్వారా పాల ఉత్పత్తులు తగ్గకుండా స్థిరంగా ఉంటాయని పెంపకందారులకు సూచించారు.

ప్రిన్సిపాల్‌కు సత్కారం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.చక్రధర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం కళాశాల ఆవరణలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

నంద్యాల(అర్బన్): జిల్లాలో రిటైర్‌మెంట్ అయిన పోలీసులను ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు సోమవారం సన్మానించారు. స్థానిక కార్యాలయంలో దొర్నిపాడు ఎస్ఐ సత్యనారాయణ, ఎస్ఐలు దేవేంద్రకుమార్, వెంకటసుబ్బయ్య, ఆర్మడు రిజర్వ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ జారప్ప వారిని కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, రిటైర్‌మెంట్ పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు ప్రశంసనీయం

గోస్పాడు: వైద్యుల సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ప్రభాకర్ రెడ్డి, మురళీ, శరత్ చంద్రారెడ్డి, శేషఫణి, జ్యోతివాణి, ఆశాలత, సరిత తదితరులకు పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, హరినాథరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గోస్పాడు: మండల పరిధిలోని పసురపాడు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాణ్యంకు చెందిన రవికుమార్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కోవెలకుంట్ల నుంచి నంద్యాలకు బైక్‌పై రవికుమార్, పవన్‌కుమార్‌లు వచ్చే వారు. అయితే పసురపాడు సమీపంలో బైక్ ఆపి రోడ్డు పక్కన మూత్రవిసర్జన చేస్తుండగా గోస్పాడు వైపు నుంచి బైక్‌పై వస్తున్న పుల్లయ్య ఢీకొట్టాడు. ఈ ఘటనలో రవికుమార్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన వ్యవసాయ కూలీ కోటపాటి పుల్లయ్య (36) కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. ఇతను కుటుంబ కలహాలతో గత నెల 29వ తేదిన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక ప్రాణాలొదిలాడు. ఈ మేరకు మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి ముగ్గురు సంతానం.